నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, సోమవారం 8 జనవరి 2024 | KARIMNAGAR


# అతివల ఆత్మవిశ్వాసం

• స్వయం కృషితో ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు • జగిత్యాల జిల్లాలో 250కి పైగా చిరు పరిశ్రమల స్థాపన • ఒక్క లక్ష్మీపూర్, జాబితాపూర్‌లో పదికి పైగా యూనిట్లు

స్వశక్తి సంఘాల మహిళలు చిరు వ్యాపారాలతో రాణిస్తున్నారు. ఐక్యత, ఆత్మవిశ్వాసం, ప్రభుత్వ సహకారంతో తోచిన స్థాయిలో వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకొని ఆర్థిక స్వావలంబన దిశలో పురోగమిస్తున్నారు. జగిత్యాల జిల్లా పరిధిలో 600 మందికిపైగా సబ్సిడీ రుణం పొంది, సొంతంగా యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపారు. అందులో 250 మందికిపైగా యూనిట్లను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఒక లక్ష్మీపూర్, జాబితాపూర్‌లో పరిధిలోనే పదికపైగా ఉండగా, పిండిగిర్ని, పిండి ఉత్పత్తుల కేంద్రం, బిర్యానీ పాయింట్స్, కోల్డ్ ఫ్రెష్ ఆయిల్, పెండ్లిల్లో ధరించే తలపాగాలు, ఐరెండ్ల కుండలు, పేపర్ ప్లేట్లు, అగర్‌బత్తీల తయారీ కేంద్రం ఇలా ఎన్నో యూనిట్లు నడిపిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు.

- జగిత్యాల, జనవరి 7 (నమస్తే తెలంగాణ)


లక్ష్మీపూర్‌లో పిండిగిర్ని నిర్వహిస్తున్న స్వశక్తి మహిళ

### కోల్డ్ ఫ్రెష్ ఆయిల్ తయారీలో భాగ్య



జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ మొదటి నుంచి ప్రగతిశీల గ్రామం. ఇక్కడి ప్రజలు వ్యవసాయంలో ఉమ్మడి రాష్ట్రంలోనే గొప్ప పేరును సంపాదించారు. ఈ గ్రామానికి చెందిన గర్వందుల భాగ్య, గంగాధర్ భార్యభర్తలు. భాగ్య స్వశక్తి మహిళ సంఘ సభ్యురాలు. ఆమెకు మొదటి నుంచీ ఏదైనా చిన్న వ్యాపారం చేయాలన్న అభిలాష ఉండేది. గ్రామంలో పలువురు మహిళలు మహిళా సంఘాల ద్వారా రుణం తీసుకొని సొంతంగా వ్యాపారం చేసే ప్రయత్నాలు మొదలుపెట్టడం చూసిన భాగ్య సైతం ఏదైనా ఒక యూనిట్ స్థాపించాలని భావించింది. వ్యవసాయ గ్రామం కావడంతో కోల్డ్‌ఫ్రెష్ ఆయిల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని అనుకున్నది. అందుకు రూ.పది లక్షలు అవుతాయన్న అంచనాలను అధికారులకు విన్నవించగా, ఏపీఎం ఓదెల గంగాధర్ సహకరించారు. ఏడాది క్రితం 30 శాతం సబ్సిడీపై రుణం మంజూరైంది. వీటితో భాగ్య హన్మాన్ కోల్డ్‌ఫ్రెష్ ఆయిల్ మిల్‌ను ఏర్పాటు చేసింది. ఈ మిల్లులో నువ్వులు, పల్లి నూనె తీస్తున్నారు. పూర్తిస్థాయిలో రిఫైన్డ్ చేసి, ఫ్రెష్ ఆయిల్‌ను వినియోగదారులకు విక్రయిస్తున్నారు. మిల్లుకు అనుబంధంగా ఒక రైస్‌మిల్లును సైతం సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. ఏడాదిగా కోల్డ్‌ఫ్రెష్ ఆయిల్ మిల్లును భాగ్య విజయవంతంగా నిర్వహిస్తోంది. 'నువ్వులు, పల్లీలు తీసుకువచ్చి నూనెను పట్టి ఇవ్వమన్నా పట్టిస్తున్నాం. పట్టిన నూనె అడిగినా విక్రయిస్తున్నాం. కిలోకు రూ.పది చొప్పున చార్జీ వసూలు చేస్తున్నాం. నూనె పట్టే క్రమంలో వచ్చే పల్లిపిండి, నువ్వుల పిండిని వినియోగదారుడు వదులుకుంటే ఆయిల్ పట్టినందుకు డబ్బులు తీసుకోవడం లేదు. ఏడాదిగా మంచి లాభాలే వస్తున్నయ్. ఇదే ప్రధాన వృత్తిగా మారింది' అని భాగ్య సంతోషంగా చెబుతున్నది.

### బీడీలు వదిలి.. పిండి వంటలతో ఎదిగిన శ్యామల



నా పేరు భారతపు శ్యామల. మాది జాబితాపూర్. ఇద్దరు ఆడపిల్లలు. నాకు వంటలు చేసుడంటే ఇష్టం ఉండేది. కానీ, పద్దెనిమిదేండ్ల పాటు బీడీలు చేసిన. అవి బంద్ చేసి ధనలక్ష్మి స్వశక్తి మహిళ సంఘం సభ్యురాలిగా చేరిన. కొన్ని రోజుల్లోనే వీవో అయిన. ప్రభుత్వం రుణం ఇస్తుందని, ఏదైనా వ్యాపారం చేసుకోమని ఏపీఎం ఓదెల గంగాధర్ సార్ చెప్తే మొదట్లో పట్టించుకోలే. మూడేండ్ల కింద ఏపీఎం సార్ సూచన మేరకు శివరాత్రి పండుగప్పుడు తినుబండారాలను తయారు చేసి స్టాల్ పెట్టాలని సూచించినా ఎవరూ ముందుకురాలే. ఏదైతే అది కాని అని నేను వేములవాడలో నాలుగు రోజుల పాటు లడ్డు, బాదుషాలు చేసి విక్రయించిన. పెద్దగా లాభం రాలే. అయితే, నేను తయారు చేసిన స్వీట్లకు గుర్తింపు వచ్చింది. తర్వాత ధర్మపురి జాతరలో స్టాల్ ఏర్పాటు చేఇసన. అక్కడ మంచి లాభాలు వచ్చినయ్. దీంతో తినుబండారాల తయారీ కేంద్రం పెట్టాలని భావించిన. ఏపీఎం సార్‌ని అడిగితే లోన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చిన్రు. 30 శాతం రాయితీతో 70 శాతం రుణం చెల్లించే పద్ధతిలో ₹5 లక్షల రుణం మంజూరైంది. వీటితో జగిత్యాల–పెద్దపల్లి ప్రధాన రోడ్డుపై జాబితాపూర్‌లో ధనలక్ష్మి పిండివంటల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన. పెద్ద గ్రైండర్, పిండి గిర్నీ, ఆయిల్ క్లీనింగ్ మిషన్, బోంది, ఖార, తదితర పదార్థాలను ప్యాకింగ్ చేసే మిషన్లను కొన్న. నిర్వహణ కోసం ఫుడ్ కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకున్న. ఆర్నెళ్ల నుంచి పిండివంటల తయారీ కేంద్రం నిర్వహిస్తున్న. లడ్డు, బాదుషా, రవ్వలడ్డు, మెంతి లడ్డూ తయారీలో కరీంనగర్ డెయిరీ నెయ్యిని వినియోగిస్తున్న. ఇంకా బోంది, ఖారా, అరిసెలు, చకినాలు, గారెలు, గరిజెలు తయరు చేసి విక్రయిస్తున్న. స్థానికంగా ఉండే మెడికల్ కాలేజీ హాస్టల్స్, మైనార్టీ హాస్టల్స్, నర్సింగ్ కాలేజీ హాస్టల్స్ వాళ్లు తీసుకెళ్తున్నరు. సాధారణ జనాలకు సైతం గోంగూర, మామిడి, చికెన్, చేపల పచ్చళ్లు తయారు చేసి విక్రయిస్తున్నం. కిలో చికెన్ పచ్చడికి రూ.వెయ్యి చార్జ్ చేస్తున్నం. మిగిలినవన్నీ సాధారణ ధరలోనే ఉన్నయి. అమెరికా, సౌదీ, దుబాయి వంటి ప్రాంతాలకు వెళ్లేవారు తీసుకెళ్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడిప్పుడే లాభాలు వస్తున్నయ్. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేయాలని ఉంది.

### మహిళలు రాణిస్తున్నరు



స్వశక్తి మహిళా సంఘాల సభ్యుల దృక్కోణంలో మార్పు వచ్చింది. గతంలో డబ్బులు పొదుపు చేసి, రుణాలు తీసుకొని అధిక వడ్డీకి ఇవ్వడానికే ఇష్టపడేవారు. అయితే, దీనివల్ల సంఘాలకు పెద్దగా లాభం రాకపోయేది. కానీ, ఇప్పుడు పొదుపు చేసిన డబ్బులతోపాటు, ప్రభుత్వం ఇచ్చే రుణాలను వినియోగించుకొని చిన్నచిన్న తయారీ, ఉపాధి కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. దీంతో ఉపాధిని స్వయంగా పొందడంతోపాటు, ఇతరులకు పని చూపించే స్థాయికి వస్తున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా చాలా మంది కుటీర పరిశ్రమలు స్థాపించుకున్నారు. ఒక్క జగిత్యాల మండలంలోనే ఇరవైకి పైగా యూనిట్లు పనిచేస్తుండగా, లక్ష్మీపూర్, జాబితాపూర్‌లోని పదికిపైగా ఉన్నాయి. 30 శాతం సబ్సిడీపై రుణాలు ఇస్తున్నాం. బ్యాంకులు సైతం సహకరిస్తున్నాయి.

- ఓదెల గంగాధర్, ఏపీఎం, జగిత్యాల రూరల్ మండలం



కోరుట్లలో పబ్లిక్ టాయిలెట్‌ను శుభ్రం చేస్తున్న యువకులు (ఫైల్)

# స్వచ్ఛ కోరుట్ల

• పరిశుభ్రతలో బల్దియా ముందంజ
• ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ అవార్డుకు ఎంపిక

కోరుట్ల, జనవరి 7: కోరుట్ల మున్సిపాలిటీ స్వచ్ఛతలో మెరిసింది. మున్సిపల్ అధికారుల కృషి ఫలించి మేటిగా నిలిచింది. పారిశుధ్య నిర్వహణలో చేసిన కృషికి గాను ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ పట్టణంగా గుర్తింపు సాధించింది. స్వచ్ఛ సర్వేక్షన్ – 2023లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో బహిరంగ మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్ ప్లస్ ప్లస్) పట్టణంగా పురస్కారానికి ఎంపికైంది. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా మున్సిపల్ అధికారులు ఇటీవల టాయిలెట్ క్లీన్ క్యాంపెయిన్ చేపట్టారు. బహిరంగ మల, మూత్ర విసర్జనతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు టాయిలెట్లు వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు పురస్కారం రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్

# సమాజంలో లాయర్ల పాత్ర కీలకం

• హైకోర్టు జడ్జి జస్టిస్ ఈవీ వేణుగోపాల్
• కుమారయ్య లా కాలేజీలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

కరీంనగర్ కోర్టుచౌరస్తా, జనవరి 7: సమాజాభివృద్ధిలో లాయర్ల పాత్ర కీలకమని, ప్రజలకు సత్వర న్యాయం చేకూర్చే బాధ్యత వారిపై ఉన్నదని హైకోర్టు జడ్జి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ అన్నారు. ఈ వృత్తిలో స్థిరపడాలనుకునేవారు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆదివారం కరీంనగర్‌లోని కుమారయ్య లా కాలేజీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళానికి హాజరై మాట్లాడారు. మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని నిర్దేశించారు. న్యాయవాదులు ఐక్యంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలని కోరారు. అనంతరం న్యాయవాదులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కుమారయ్య కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ కే జలజ, డైరెక్టర్ జీ కృష్ణప్రసాద్, కార్యక్రమ కన్వీనర్ న్యాయవాది ఏ కిరణ్ కుమార్, సీనియర్ న్యాయవాది ఏవీ రమణ, డీఎల్ఎస్ఏ జడ్జి కే వెంకటేశ్, లాయర్లు గుండా భవానీ, పొన్నం రజిత, మంతెన సురేశ్ కుమార్, గాదం స్వామి తేజ, బొంకూరి మోహన్, బండారు గాయత్రీ దేవి, ఎండీ నావజ్, పత్తి శివ ప్రసాద్, వంకాయల రాజ్‌కుమార్, అట్ల ధీరజ్, సావుల రాజమౌళి, ఆడెపు దినేష్, అతికం రాజశేఖర్ గౌడ్, ఎన్నం మమత, తడూరి స్వాతి, బత్తిని స్వప్న, ఉన్నారు.



అవార్డు అందుకుంటున్న లక్కీ మిరానీ

# లక్కీ మిరానీకి 'షైనింగ్ స్టార్-23' పురస్కారం

కరీంనగర్ కమాన్ చౌరస్తా, జనవరి 7: కండ్లు కనిపించకున్నా చదువులో రాణిస్తున్న లక్కీ మిరానీ నటనలోనూ మెప్పిస్తున్నాడు. స్వయంగా దర్శకత్వం వహించి, నటించిన 'లైట్ అండ్ డార్క్' చిత్రానికి మెండ ఫౌండేషన్ షైనింగ్ స్టార్ ఆఫ్ సౌతిండియా–2023 పురస్కారానికి ఎంపిక చేసింది. శనివారం రాత్రి బెంగళూర్‌లో ఓ హోటల్‌లో అట్టహాసంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్కీమిరానీకి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు. ముమ్ముందు తాను ఎంచుకున్న రంగాల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.


విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న ఓదెలు కుమార్ (ఫైల్)

# ప్రయోగాత్మక బోధనకు కేరాఫ్ ఓదెలు

సులభంగా.. విద్యార్థులను ఆకట్టుకునేలా ఫిజికల్ సైన్స్ బోధన
ఇటీవలే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్ట్‌కు ఎంపిక
నాలుగోసారి ఘనత • ఇప్పటికే అనేక అవార్డులు • పలువురి అభినందన

కరీంనగర్ కమాన్ చౌరస్తా, జనవరి 7: కరీంనగర్‌కు చెందిన బాషాబత్తిని ఓదెలు కుమార్‌కు ప్రయోగాత్మక బోధనకు కేరాఫ్‌గా నిలుస్తున్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్ అంటే మక్కువ ఉన్న ఆయన, తన అభిరుచికి అనుగుణంగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం చిగురుమామిడి జడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్నారు. కఠినమైన ఫిజికల్ సైన్స్‌ను విద్యార్థులకు సులభంగా బోధించాలని సంకల్పించారు. అందుకు ప్రయోగాత్మక విధానాన్ని ఎంచుకొన్నారు. వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన పరికరాలను రూపొందించి వినూత్నంగా బోధిస్తుండడంతో విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు. ఈ విధానమే కుమార్‌కు ప్రత్యేక గుర్తింపు తేగా, జాతీయస్థాయి సెమినార్లు, విజ్ఞాన ప్రదర్శనలకు ఎంపికై సత్తా చాటారు. ప్రతిష్టాత్మకమైన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్ట్‌కు సెలక్ట్ అయ్యారు. ప్రయోగత్మకంగా బోధిస్తూ నాలుగోసారి ఈ ఘనత సాధించారు. ఈ నెల 17 నుంచి 20 వతేదీ వరకు ఫరిదాబాద్‌లో నిర్వహించనున్న భారతదేశపు మెగా సైన్స్ ఫెస్టివల్ (క్యాంప్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్)లో పాల్గొననున్నారు. అంతర్జాతీయ, జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తల సెమినార్లుతో పరస్పర చర్చలు, ప్రదర్శనలు, పోటీలు, విజ్ఞానశాస్త్ర భాగస్వామ్య కార్యక్రమాలు, సాంకేతిక ప్రదర్శనల్లో పాలుపంచుకోనున్నారు. ఐఐఎస్ఎఫ్‌కు ఎంపికైన కుమార్‌ను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, జనవరి 7 : రాజస్థాన్ రాష్ట్రంలో ఈ నెల 9 నుంచి 13 వరకు జరుగనున్న జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డవేని మధు, జిట్టవేని శ్రీను తెలిపారు. గత నెల 5న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో పాల్గొన్న జైనపురం వంశీ, బీ శివ అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కాగా, వీరిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, పెటా అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల శ్రీనివాస్, యూనిస్ పాషా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్, రాజ్‌కుమార్, అనుపరెడ్డి, వీరుపాల్‌రెడ్డి, ఐతరవని శ్రీనివాస్, వడ్లూరి రాజేందర్ అభినందించారు.


జగిత్యాల వనభోజనాల కార్యక్రమంలో ఉద్యోగులకు భోజనం వడ్డిస్తున్న డీఎం సునీత

# ఆర్టీసీలో వనభోజనం

నిత్యం బస్సుల్లో ప్రయాణిస్తూ.. డిపోల్లో మరమ్మతులు చేస్తూ తీరిక లేకుండా గడిపే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ సిబ్బంది రిలీఫ్ కోసం సంస్థ వినూత్నంగా వనభోజనాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉద్యోగులు ఒత్తిడికి లోను కాకుండా ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో రెండు దఫాలుగా ఈ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా ఆదివారం ఆదివారం జగిత్యాల, సిరిసిల్ల డిపోల్లో నిర్వహించగా ఉద్యోగులు ఆటాపాటలు, డ్యాన్సులతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా జగిత్యాలలో డీఎం సునిత స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) హిమబిందు, సూపరింటెండెంట్ జగదీశ్వరి, మెకానిక్ ఫోర్ మెన్ కవిత పాల్గొన్నారు. సిరిసిల్లలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలిచిన వారికి కరీంనగర్ రీజినల్ డిప్యూటీ ఆర్ఎంవో భూపతిరెడ్డి, డిపో మేనేజర్ ఎన్ మనోహర్ బహుమతులు అందించారు.

– జగిత్యాల, జనవరి 7


సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో ఆటలు ఆడుతున్న ఉద్యోగులు

# సర్కారు దవాఖానలో లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు

విద్యానగర్, జనవరి 7: అరుదైన ఆపరేషన్లకు కేరాఫ్‌గా నిలుస్తున్న కరీంనగర్ జిల్లా దవాఖాన వైద్య బృందం మరో ఘనత సాధించింది. కడుపునొప్పితో బాధపడుతున్న ఇద్దరు పేషెంట్లకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన లాప్రోస్కోపిక్ సర్జరీ చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన చరణ్, ప్రసన్న అనే యువకులు తీవ్రమైన కడుపునొప్పితో మూడు రోజుల కిందట కరీంనగర్ దవాఖానలో చేరారు. పరీక్షలు చేసిన వైద్యులు అపెండిసైటిస్‌గా నిర్ధారించి ఆపరేషన్ అవసరమని చెప్పారు. వారి కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఆదివారం జనరల్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ, ప్రొఫెసర్ డాక్టర్ టీ శాలిని ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేందర్, డాక్టర్ హరికృష్ణారెడ్డి, డాక్టర్ ప్రణయ్ కుమార్, సీనియర్ డాక్టర్ మిలాన్ సమక్షంలో లాప్రోస్కోపిక్ పద్ధతిలో ఆపరేషన్ చేశారు. ప్రైవేట్ దవాఖానల్లో రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు అయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేయడంపై పేషెంట్ల కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య బృందాన్ని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి అభినందించారు.


లాప్రోస్కోపిక్ విధానంలో శస్త్ర చికిత్స చేస్తున్న కరీంనగర్ జనరల్ దవాఖాన వైద్యులు

# నిహాల్‌కు ప్రాణభిక్ష పెట్టండి

• ఎనిమిదేళ్ల బాలుడికి కాలేయ సమస్య • లివర్ మార్పిడి చేయాలన్న వైద్యులు • చికిత్సకు ₹44 లక్షలు అవసరమని స్పష్టం • సాయం కోసం తల్లిదండ్రుల వేడుకోలు


చికిత్స పొందుతున్న నిహాల్

కోనరావుపేట/ వేములవాడ టౌన్, జనవరి 7: కాలేయ సంబంధింత సమస్యతో బాధపడుతున్న ఆ బాలుడిని చూసి తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. లివర్ మార్పిడి చికిత్సకు ₹44 లక్షలకు పైనే అవసరం కాగా, దాతల కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేసి తమ కొడుకుకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన ఉలిసె చందు–పల్లవి దంపతులకు కూతురుతోపాటు కొడుకు నిహాల్(8) ఉన్నారు. నిహాల్ మూడో తరగతి చదువుతున్నాడు. పదిహేను రోజుల క్రితం పచ్చ కామెర్లు వచ్చాయని సిరిసిల్లలోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా కాలేయ సంబంధిత సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీంతో హైదరాబాద్‌లోని రెయిన్‌బో దవాఖానకు బాలుడిని తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు, బాలుడికి లివర్ సంబంధింత సమస్య ఉందని, మార్పిడి (ట్రాన్స్‌ప్లాంటేషన్) చేయాలని చెప్పారు. వెంటనే సమాచారం అందుకొని తండ్రి చందు దుబాయి నుంచి వచ్చాడు. తన కొడుకు పరిస్థితిని చూసి కన్నీరుమున్నీరయ్యాడు. అనంతరం వైద్యులను కలిశారు. లివర్ ప్లాంటేషన్‌కు ముందుకు రాగా, ఇద్దరికీ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం తల్లి కాలేయ భాగం బిడ్డకు సెట్ అవుతుందని నిర్ధారించారు. అయితే ఈ చికిత్సకు సుమారు ₹44లక్షల నుంచి ₹55లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో ఆ తల్లిదండ్రులు సాయం కోసం అర్థిస్తున్నారు. తమ కొడుకును బతికించాలని వేడుకుంటున్నారు. దాతలు గూగుల్‌పే, ఫోన్‌పే (90005–57271) ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు. కాగా, వైద్య చికిత్స కోసం 'మై వేములవాడ' చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆదివారం నిహాల్ కుటుంబసభ్యులకు ₹22,153 చెక్కును అందించారు. ఇక్కడ ట్రస్ట్ సభ్యులు మధుమహేశ్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహ్మద్ అబ్దుల్ రఫిక్, కొప్పుల హనుమాన్, గొంగళ్ల రవికుమార్, చల్ల సత్తయ్య ఉన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్‌కు నిధులు


కమాన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

పెద్దపల్లి, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ నిర్వహణకు ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే నెల ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు నిర్వహించనుండగా, అందుకు కావల్సిన నిధులను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. కెమిస్ట్రీ, బయోలజీకి సబ్జెక్టులకు సంబంధించి పలు రకాల ప్రయోగాలకు వివిధ పరికరాలు, కెమికల్స్, ఇతరత్రా వస్తువులు అవసరం ఉంటాయి. అయితే వాటిని సమకూర్చుకోవడం ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు భారంగా మారుతున్నది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14 ఉన్నాయి. వీటిలో 3,467మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో ఒక్కో విద్యార్థికి కాలేజీ మెయింటనెన్సీ ఖర్చుల కింద ₹38 చొప్పున ₹1,31,746ల నిధులను ప్రభుత్వం విడుదల చేయగా, విద్యార్థులు, కళాశాలల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఖాతాల్లో జమ చేస్తాం



ఇంటర్ ప్రాక్టికల్స్ వచ్చే నెలలో నిర్వహిస్తాం. అయితే కళాశాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను త్వరలోనే ఆయా కాలేజీల ఖాతాల్లోకి జమ చేస్తాం. ప్రయోగాలకు సంబంధించి రసాయనాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు ఈ నిధులను వినియోగించుకోవాల్సి ఉంటుంది.

- దాసరి కల్పన, ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ (పెద్దపల్లి)

# ఎములాడ జనసంద్రం


వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 7: వేములవాడ రాజన్న క్షేత్రం కిక్కిరిసింది. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే ధర్మగుండంలో స్నానం చేసి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. రద్దీ అధికంగా ఉండడంతో అధికారులు గర్భగుడి దర్శనాలను రద్దుచేసి శీఘ్ర దర్శనానికి మాత్రమే అనుమతించారు. దాదాపు 20వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా ఆలయానికి ₹10 లక్షల ఆదాయం సమకూరినట్లు ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్ తెలిపారు.